# మూడు వేలమంది రక్షింపబడింది ఎలాగో!
# (2:37-41, 47)

గత రెండు పాఠాల్లో, అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందడం, పేతురు తొలిగా సంపూర్ణమైన సువార్తను ప్రకటించడం అనే వాటిలో మునిగిపోయి, పెంతెకొస్తుయొక్క ఉత్సాహాన్ని అనుభవించాం. అపొ. 2లో మన పఠనాన్ని కొనసాగించేటప్పుడు, మూడువేలమంది రక్షింపబడిన ముఖ్యమైన సమయంలో యూదులయొక్క మార్పువైపు మన దృష్టి మల్చుదాం.

వారి మార్పుకు బీగం మనం గత పాఠంలో చదివిన పేతురు యొక్క ఘనమైన ప్రసంగమే. ''కాగా వినుటవలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన[1] మాటవలన కలుగును'' అని పౌలు చెప్పాడు (రోమా 10:17). ఎవడైనా రక్షింప బడాలంటే, అతడు మొదటిగా క్రీస్తునుగూర్చి వినాలి![2] ''మీరు సిలువ వేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను, ఇశ్రాయేలు వంశమంతయు యిది రూఢిగా తెలిసికోవాలనే'' పేతురు మాటలతో చెవులు గింగురుమంటూ ఉండగా, మనం గత పాఠాన్ని ముగించుకొన్నాం (2:36). పేతురు మాటలను అతని శ్రోతలు విన్నప్పుడు, వారు ఎలాటి ప్రతిక్రియ చేశారు?

## క్రీస్తునందు విశ్వాసముంచుట ద్వారా (2:37)

యేసునుగూర్చి శక్తివంతమైన ఉపదేశాన్ని పేతురుచేసిన తరువాత, కొంతసేపు నిశబ్దంగా నిలిచి పోయుంటారని నేను ఊహిస్తున్నాను. తరువాత వేదనకరమైన శబ్దం తన శ్రోతలలోనుండి పుట్టుకొచ్చింది. ''- వారు ఈ మాట విని[3] హృదయములో నొచ్చుకొని, 'సహోదరులారా, మేమేమి చేతుమని' '' పేతురును కడమ అపొస్త లులను అడిగారు (37 వ.).[4] యేసునుగూర్చి పేతురు తమకు యిప్పుడు ఏమి తెలియజేశాడో దానియందు వారు నమ్మికయుంచారు. లేకుంటే, వారు అలా అడిగి యుండేవారు కాదు. రక్షణకు విశ్వాసం అవసరం (యోహాను 8:24).

యేసే క్రీస్తని వారు నమ్మి, ''మేమేమి చేతుమని'' వారు బిగ్గరగా అడిగారు. అయితే వారి ప్రశ్నలో ఉన్న వేదనను మనం పూర్ణంగా గ్రహించలేం. వారు తమ

జీవితాల్లో మెస్సీయాకొరకు ఎదురుచూచారు. ప్రతి ప్రార్థన, సమాజమందిరపు కూడిక, పండుగ దినాలు వగైరాలన్నీ జనాంగంగా మెస్సీయాకొరకు వారి వాంఛను ప్రదర్శించాయ్; ఆయనే వారి రక్షణ శృంగము; ఆయనే వారి నిరీక్షణ! పేతురు తన సందేశంయొక్క శిఖరాగ్రానికి చేరేసరికి, మెస్సీయా వచ్చారన్న సత్యం వారికి తీక్షణంగా తట్టింది! వారాయనను కేవలం నిరాకరించడం మాత్రమే గాక, ఆయనను సిలువకు అప్ప గించారు.[5] పేతురు మాటలు వింటున్న వారిని ఈ దోషంయొక్క గ్రహింపు బహుగా కలతపరిచింది. వారు బహుఘోరమైన పాపం చేశారు! ఉత్సహించవలసిన దినం దుఃఖ సాగరంగా మారిపోయింది. అందువలన, ''సహోదరులారా, మేమేమి చేతు మని ...'' అడిగారు. వారి భావి, నిరీక్షణ లేనిదేనా? (తెలిసికోగోరినట్టున్నారు).

## క్రీస్తుకు విధేయులగుట ద్వారా (2:38-41)

యూదులయొక్క దోషారోపణతో కూడిన అనుభూతిని మనం ఎలా అభి నందించలేమో, అలాగే, వారి ప్రశ్నకు: ''మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు'' - అని పేతురు బదులిచ్చినప్పుడు, వారి బాధనుండి విముక్తి ప్రసాదించే అనుభవం వారి ఆత్మలను ఎలా ముంచివేసిందో కూడా మనం అభినందించలేం (2:38). నిరీక్షణ నిలిచియుంది! మెస్సీయాను సిలువవేసిన పాపానికి క్షమాపణ ఉంది! ప్రతివాడు మారుమనస్సు పొంది బాప్తిస్మం పొందగలడు; పాపక్షమాపణ యొక్క షరత్తులు అందుకోలేనంత దూరంగా ఎవనికీలేవు. పైగా, మెస్సీయాను సిలువవేసిన పాపానికే మారుమనస్సు పొంది, బాప్తిస్మం పొందమనడం లేదు; మీ పాపాల క్షమాపణ అన్న బహువచనం కూడా అతడు ఉపయోగించాడు. పేతురుయొక్క ఉపదేశాన్ని వారనుసరించినట్టయితే, తమ జీవితాల్లో జరిగించి వేదనతో నిద్రలేని రాత్రులు గడిపిన పాపాలకు సహితం, దేవుని కృప విస్తరించి, వాటిని కప్పుతుంది!

పేతురు సందేశం అనుసరించడానికి అసాధ్యమయింది కానప్పటికి, అది అంత సులభమైనదికూడా కాదని నొక్కి చెప్పవలసియుంది. వారి జీవితాల్లో 180 డిగ్రీల మల్పుకన్న ఏ తక్కువ దానిని గూర్చి పేతురు మాట్లాడలేదు; వారు గత పాపమార్గాన్ని మాని, నేటి నూతన జీవముపొంది నడుచుకోవాలి, వారు మోషేను అనుసరించడం మాని, క్రీస్తును వెంబడించాలి! తమ రానున్న జీవిత దినాలన్నిటిలో కనపరచబడేలా క్రీస్తునకు తమ్మును తాము అప్పగించుకోవాలని పేతురు మాట్లాడుతున్నాడు!

మొదటిగా వారు ''మారుమనస్సు'' పొందాలని పేతురు తెలియజేశాడు. ఒకని, ''మనస్సు మార్పు లేక స్వభావం మార్పు'' అని అక్షరార్థమిచ్చే మిశ్రిత గ్రీకు పదం నుండి తర్జుమా చేయబడింది. అది మనష్యులకు వర్తింపజేసినప్పుడు, ''పాపం

విషయంలో ఒకని మనస్సు మారడం'' - పాపం జరిగించడాన్ని నిలుప తీర్మానించుకొని, మరో రకమైన జీవితాన్ని జీవించడం - అనే అర్థం సహజంగా చెప్పబడింది![6] దేవుడు చూచినట్టు పాపాన్ని చూచి, అది ఎంత భయంకరమైయిందో గ్రహించినప్పుడు, దైవ చిత్తానుసారమైన దుఃఖంవలన ఈ మారుమనస్సు కలుగుతుంది (2 కొరింథీ. 7:10) (పాపం విషయంలో పశ్చాత్తాపపడటమే మారుమనస్సుకాదు). పేతురు యొక్క శ్రోతలు, ''హృదయంలో పొడవబడ్డారు.'' తాము చేసిన దానికి వారు నిజంగానే చింతిస్తున్నారు. అయినా ''మారుమనస్సు'' పొందమని పేతురు వారికి చెప్పాడు. నిజమైన మారుమనస్సు జీవితాన్ని మార్చుతుంది. ''వారు మారుమనస్సు పొంది దేవునితట్టు తిరిగి మారుమనస్సునకు తగిన క్రియలు చేయవలెనని'' పౌలు అన్యజనులకు ప్రకటించాడు (26:20). మారుమనస్సు అనేది కష్టమే ఎందుకంటే అది నూతన జీవిత విధానాన్ని కోరుతుంది.

తరువాత, ''బాప్తిస్మం పొందమని'' పేతురు వారికి తెలిపాడు. ''బాప్తిస్మం పొందమంటే'' అక్షరార్థంగా ''ముంచడం పొందండని'' దాని భావం.[7] ఈ లేఖన బాగంలో, ''నీళ్లలో ముంచబడండని'' దాని అర్థం. నీళ్లలో ముంచబడడమనేది పేతురుయొక్క శ్రోతలకు వింతైనదికాదు. ఆచార సంబంధమైన (ప్రక్షాళనములు) శుద్ధీకరణలు వారికి తెలుసు.[8] పైగా కొద్ది సంవత్సరాలకు ముందు, బాప్తిస్మమిచ్చు యోహాను ప్రజలకు యొర్దాను నదిలో బాప్తిస్మమిస్తూ గొప్ప కలవరాన్ని కలిగించాడు.[9] అయినా, పేతురుయొక్క ఆజ్ఞ కొన్ని క్రొత్త సంగతులను అందులో చేర్చింది. మొదటిగా, వారు ''యేసు క్రీస్తు నామమున'' బాప్తిస్మం పొందాలి. (పేతురు యేసు అను పేరుతో క్రీస్తును జతచేశాడు).[10] ''నామము'' అనేది - ఆ వ్యక్తిని, ఆయన శక్తిని ఏకం చేసింది.[11] అక్షరార్థంగా,[12] యేసుక్రీస్తుయొక్క నామ ''ముపై'' బాప్తిస్మం పొందాలి.[13] దీనికి అర్థం - యేసే క్రీస్తని వారంగీకరించి, ఆయనను వారి జీవితాలకు ప్రభువుగా వారంగీకరించినట్టే.

''యేసుక్రీస్తు నామమున'' అనే మాటలు- వారు బాప్తిస్మం పొందకముందు ఏదో ఒక విధంగా, యేసునందు వారు తమ విశ్వాసాన్ని గుర్తింపజేసికొన్నట్టు సూచిస్తున్నాయి.[14] ''ప్రభువు నామమున ప్రార్థించు ప్రతివాడును[15] (సహాయంకోరి ప్రార్థించు ప్రతివాడును) రక్షింపబడునని యోవేలు అన్నట్టు పేతురు సూచించాడు (21 వ.). 'యేసుక్రీస్తు నామమున' బాప్తిస్మమిచ్చారంటే -ఆయన అధికారంలో మాత్రమే కాకుండ, బాప్తిస్మం పొందేవాడు ఆయన నామమునుబట్టి ప్రార్థించడమో లేక ఒప్పుకొనడమో జరిగియుండవచ్చు (22:16ను పోల్చిచూడు)'' అని F. F. Bruce అన్నాడు.[16]

యేసునామములో బాప్తిస్మం పొందడం అనే భావన - బాప్తిస్మం పొందేవాడు యేసునందు ప్రభుభక్తితో ప్రవేశించేలా చేస్తుంది. గనుక బాప్తిస్మం పొందే సందర్భంలో

యేసు ప్రభువు అని ఒప్పుకొనడం అనే అలవాటుకు యిది రుజువుగా ఉంటుంది[17] అని I. Howard Marshall అనే వ్యాఖ్యాన కర్త సలహాయిచ్చాడు. పేతురుయొక్క శ్రోతలు యేసుక్రీస్తు నామములోనికి బాప్తిస్మం పొందినప్పుడు, వారు తమ్మునుతాము ఆయనకు అప్పగించుకొన్నారు![18]

పేతురు బాప్తిస్మం పొందనాజ్ఞాపించిన దానికి (గత బాప్తిస్మానికి) గల రెండవ వ్యత్యాసమేమంటే - ''పరిశుద్ధాత్మ అను వరము'' వాగ్దానం చేయబడింది. ''పరిశుద్ధాత్మ అనే వరం'' అనే మాటలకు పలురకాలైన భావాలు ఉండే అవకాశముంది. అపొస్తలులు తమ చేతులుంచడం వలన ప్రజలకు యివ్వబడిన శక్తులకు, ''దేవుని వరము'' అని 8:20లో ఉంది. కొర్నేలియింట పరిశుద్ధాత్మ దిగి వచ్చినప్పుడు, ''పరిశుద్ధాత్మ వరము'' (10:45; 11:17 చూడు) అని ఉంది. క్రొత్త నిబంధనలోని యితర స్థలాల్లో - ''పరిశుద్ధాత్మ వరములు'' అనేవి దైవ ప్రేరేపణవలన బోధించే సువార్తికులకు అనుగ్రహింపబడిన అద్భుత శక్తులను సూచిస్తున్నాయి (హెబ్రీ. 2:4). అపొస్తలులు చేతులుంచి ప్రార్థించడం వలన కృపావరములను గ్రహింపబడ్డాయి - (1 కొరింథీ. 12:4, 9, 28, 30-31; రోమా. 12:6 కూడా చూడు).

అలాటప్పుడు, 2:38లో చెప్పబడిన పరిశుద్ధాత్మ అను వరము అనేది ఏమి? ఆ మాటలకు భావం ఆది భాషలోగాని, తెలుగులోగాని, ''పరిశుద్ధాత్మ అనుగ్రహించిన వరము అనే భావంకావచ్చు లేదా,'' పరిశుద్ధాత్మతో కూడిన వరము అనియైనా అయ్యుండవచ్చు. సందర్భం దాని భావాన్ని నిర్ణయిస్తుంది. దగ్గరగాను, దూరంగాను ఉన్న సందర్భాలనుబట్టి (2:38), మనము ఈ వాస్తవాలను గుర్తించుదాం: (1) ఇది బాప్తిస్మం పొందిన వారికందరికి చెందే సార్వత్రిక వరం. పరిశుద్ధాత్మ బాప్తిస్మము గాని, ప్రజలమీద చేతులుంచి సామర్థ్యం కలిగియుండడంగాని సార్వత్రికమైన వరములు కావు. గనుక ఈ వరము వాటిని సూచించడంలేదు. (2) ఈ వరము అద్భుతాలు జరిగించే వరంకాదు. ఈ వరాన్ని 3000 మంది ఆ దినానే పొందినా, అపొస్తలులు తప్ప తక్కినవారు అద్భుతాలు చేసినట్టులేదు.[19] అందువలన ఆ వరము అద్భుత శక్తులకు సంబంధించిందికాదు. (3) ఈ వరము పాపక్షమాపణ అనే వరమూకాదు. ఎందుకంటే, పాపక్షమాపణతో పాటు, ఈ పరిశుద్ధాత్మ అను వరము యివ్వబడింది (2:38). (4) ఈ వరము ఏదో ఒక మార్గంలో విశ్రాంతి కాలములను సూచిస్తున్నట్టుంది (3:19 ని, 2:38తో పోల్చి తరువాత చూద్దాం). (5) కొన్ని అధ్యాయాల తరువాత, ''దేవుడు తనకు విధేయులైన వారికి అనుగ్రహించిన పరిశుద్ధాత్మ అని పేతురు అంటున్నాడు'' (5:32). పరిశుద్ధాత్మ తానే వరముగా ఉండగలడు. (6) మిగిలిన క్రొత్త నిబంధన అంతటిలో, క్రైస్తవులందరితో (వారిలో నివాసం చేస్తూ) ఉంటాడని చెప్పబడింది; వారు దేవుని పిల్లలనే అభయమిస్తూ, లోకాన్ని జయించడానికి సహాయం చేస్తూ ఉంటాడు (రోమా.

8:9, 13, 16-17, 26; 1 కొరింథీ. 6:19-20; గలతీ. 4:6-7; ఎఫెసీ. 1:13-14). ఇలా రుజువు మనయెదుట పెట్టబడియుండగా F. F. Bruce వచ్చినట్టే మనంకూడా యిలాటి నిర్ణయానికి వస్తాం: ''పరిశుద్ధాత్మ అను వరము'' అంటే, హెచ్చింపబడిన ప్రభువుచే తండ్రియొక్క అధికారం క్రింద ''పరిశుద్ధాత్మయే వరముగా అనుగ్రహింపబడడమే.''[20]

ఆ సందర్భంలో పేతురుయొక్క శ్రోతలకు ఏమి గ్రహింపై యుండిందో? పరిశుద్ధాత్మ దేవత్వంలో మూడో వ్యక్తి అన్న సందేశం పాత నిబంధనలో చెప్పబడింది గాని, తేటగా నిర్వచింపబడలేదు.[21] పేతురు యోవేలును కోట్ చేసినప్పుడు ''నా ఆత్మ'' అనే మాటలు ఉపయోగించబడ్డాయి (2:17-18). పేతురు పరిశుద్ధాత్మ అని ప్రయోగించినప్పుడు (33, 38 వచ.), అతని శ్రోతలు పరిశుద్ధాత్మను దేవత్వంలో ఉన్న ప్రత్యేకమైన వ్యక్తి అనుకునే దానికి బదులు, దేవుని సొంత ఆత్మ అని వారనుకొని యుండవచ్చు.[22] మరోవిధంగా చెప్పాలంటే, వారు పేతురు మాటలు వింటున్నప్పుడు, వారు బాప్తిస్మం పొందగానే, దేవుడే తమ జీవితాల్లోనికి వస్తారని భావించియుండవచ్చు. వాగ్దానంలో యిమిడియున్నదంతా వారు ఎరుగకపోయి ఉండవచ్చు, అయితే, ఆ మాటలు వారిని ఎంతగా ఆనందింపజేసి ఉంటాయో చెప్పనొల్లపడదు. మెస్సీయాను సిలువవేసినందుకు వారిని విసర్జించే దానికి బదులు, తన ప్రజలతో ఆయన యింతక మునుపు ఎన్నడూ ఉండని విధంగా, మారుమనస్సు పొంది, బాప్తిస్మం పొందినవారితో దేవుడు ఉంటారట![23]

పేతురు తన శ్రోతల ఎదుట వారు కోరుకొనే అవకాశాన్ని పెట్టాడు: యేసును మెస్సీయాగా అంగీకరించక, వారాయనకు అవిధేయులైయుండవచ్చు. ఒకవేళ అదే వారి నిర్ణయమైతే, ఊహాతీతమైన వారి పాపం ఎన్నడూ క్షమింపబడదు సరిగదా, దేవుడు తన ముఖాన్ని వారినుండి తిప్పివేసికొంటారు (లేక ఆయన వారికి విముఖుడై యుంటారు).[24] లేకుంటే, వారు యేసువైపు తిరిగి, మారుమనస్సుపొంది నీళ్లలో ముంచడం పొందినవారై తమ జీవితాలను ఆయనకు సమర్పించుకోవచ్చు. ఒకవేళ వారు యిలా జరిగించినట్టయితే, వారి పాపాలన్నీ క్షమించబడతాయి, దేవుడు వారితోకూడ ఉంటారు.

దేవుని కృపను సద్వినియోగం చేసికొమ్మని పేతురు వారిని బతిమాలాడు: ''ఈ వాగ్దానము మీకును మీ పిల్లలకును, దూరస్థులందరికిని, అనగా ప్రభువైన మన దేవుడు తనయొద్దకు పిలిచిన వారికందరికిని చెందునని'' చెప్పాడు (2:39).[25] ''ఈ వాగ్దానము'' - దేవుని కృపకును, దానికి సంబంధించిన దీవెనలన్నింటికిని సూచింపబడింది. ఈ వాగ్దానం మీ పిల్లలకు కూడా విస్తరింపజేయబడింది. ఈ వాగ్దానానికి కొనసాగే స్వభావముంది.[26] ''దూరస్థులందరికిని'' అనడంలో, ఈ వాగ్దానం సార్వత్రికమైనదని సూచింపబడింది. ఇది అందరికీ (అయితే ఇది పేతురుకే

అర్థం కావాలంటే - అద్భుతమే జరుగవలసియుంది).[27]

''ఇంకను అనేకమైన మాటలతో[28] సాక్ష్యమిచ్చుచు,[29] మీరు మూర్ఖులగు (వక్రజనం) ఈ తరమువారికి వేరై రక్షణ పొందుడని'' వారిని హెచ్చరించాడు (2:40).[30] ''జనం'' అనేది యేసును నిరాకరించిన యూదులను సూచిస్తుంది.[31] వారు వక్రజనంలోనుండి వేరై దేవునిచే అంగీకరింపబడవచ్చు. లేదా, ఆ వక్రజనం మధ్యనే నిలిచి, దేవునిచే నిరాకరింపబడవచ్చు - అది వారికే వదలివేయబడింది.[32] ''రక్షణపొందుడి'' అనే మాట ఆదిభాషలో ఆజ్ఞరూపంలో ఉంది. అంటే, అది విధేయత చూపవలసిన ఆజ్ఞయై యుంది. అది వారు చేయవలసిన పనియైయుంది.[33]

జనసమూహాలు ఒప్పింపబడిన వాస్తవంగాని, తమ పాపం విషయంలో ''వారడిగిన వాస్తవంగాని'' - పేతురు చెప్పేది వారు చేయబోతారనే హామీని యియ్యవు. తమ పాపము విషయంలో ఒప్పింపబడిన మనుష్యులు మన అనుభవంలో ఉన్నారు, అయితే వారు చేయవలసిన కార్యాన్ని గూర్చి తెలిసినప్పుడు, వారు దాని విలువ చెల్లించడానికి యిష్టపడక వెనుకకు వెళ్లినట్టు మన మెరుగుదుం. అయితే ఆ తరువాత మాటలను చదువుతుంటే, బహు ఉత్సాహంగా ఉంటుంది; చూడు! ''అతని వాక్యమును అంగీకరించినవారు బాప్తిస్మము (నీళ్లలో ముంచడం) పొందిరి!''[34] (2:41). తమ గత జీవితాలకు కాదు; యేసుకే ''అవును'' అని మూడువేలమంది అన్నారు!

బాప్తిస్మం పొందాలనే ఆజ్ఞతో ఆ మూడువేలమందికి ఏ సమస్యాలేదు సరిగదా, క్రైస్తవులుగా మారాలని తరువాత అనుకొన్న వారికికూడా ఏ సమస్యాలేదు. ''బాప్తిస్మము పొందని విశ్వాసి అనే భావనకు క్రొత్త నిబంధనలో స్థానమేలేదని'' Bruce అన్నాడు.[35] అయితే బాప్తిస్మమనే ఆజ్ఞవద్ద కొందరు తొట్రిల్లుతున్నారు. బాప్తిస్మమనేది పవిత్ర కార్యం గనుక, ఆ కార్యాన్ని జరిగించినంతనే ఒకడు దీవించబడతాడని కథోలిక్ సంఘం అంటే; కొన్ని ప్రొటెస్టెంటు తెగలు, దానికి వ్యతిరేకమైన దరికి గెంతి (దూకి) బాప్తిస్మంలో ఏ దీవెనా లేదనడానికి తెగించారు. ''అది చేయడం మంచిదే''నని వారంటారు. అయితే అది కేవలం ''ఆంతర్యంలో జరిగిన శుద్ధీకరణకు'' బహి రంగమైన గురుతు మాత్రమేనట! మత సంబంధమైన గుంపుల్లో ఎక్కువ మంది తమ శాఖలో చేర్చుకోడానికి బాప్తిస్మం అవసరమని భావిస్తారు కాని, మానవ విమోచన కొరకైన దేవుని సంకల్పంలో, దాని పాత్ర ఏమీలేదని వారంటారు. దానికి వ్యతిరేకంగా, ప్రభువైన యేసు, సమస్త జనులను శిష్యులుగా చేయుడని తన అపొస్తలులకు ఆజ్ఞాపించి నప్పుడు, ఒకడు రక్షణ పొందగోరితే, అతడు నమ్మి, బాప్తిస్మం పొందాలని యేసు చెప్పారు (మార్కు 16:16). ఆయన ఆజ్ఞను శిరసావహిస్తూ, పేతురు, పరిశుద్ధాత్మ వలన నడిపింపబడినవాడై తన శ్రోతలు ''పాపక్షమాపణ నిమిత్తము'' బాప్తిస్మం పొంద వలసిందేనని స్పష్టం చేశాడు (2:38).

2:38లోని ''పాపక్షమాపణ నిమిత్తము'' అనే మాటల ప్రభావాన్ని తప్పించు కొనడానికి చాలా ప్రయత్నాలు జరిగాయి.[36]

నేరస్తులకు సంబంధించిన కోర్టు కేసుల్లో, నేరం మోపబడినవాని వ్రేళ్ల గురుతులు తెరపై నేరం జరిగిన స్థలమందున్న వ్రేళ్ల గురుతులతో పాటు చిత్రించి చూపుతారు. అప్పుడు రెండింటిని గమనించి తమ అభిప్రాయాన్ని న్యాయాధికారికి తెలియజేసే జూరీని అక్కడికి ఆహ్వానిస్తారు. అలాగే, మూడు లేఖన భాగాల్లో ఉండే మూడు గ్రీకు సంపూర్ణ క్రియలేని పద సముదాయాలను ఒకచోటుకు తెచ్చి చూద్దాం. కొయినే గ్రీకుతో ఒకవేళ నీకు పరిచయం లేకపోయినా, ప్రాథమికంగా ఆ మూడు ఒకటిగానే ఉన్నట్టు నీవు చూడగలవు:

మత్తయి 26:28: యేసు రక్తము చిందింపబడింది
ʼεις ʼαφεσιν ʼαρματιων
(అక్షరార్థంగా, పాపక్షమాపణ నిమిత్తమే).

లూకా 24:47: మారుమనస్సు ప్రకటింపబడేది
ʼεις ʼαφεσιν ʼαρματιων
(అక్షరార్థంగా, పాపక్షమాపణ నిమిత్తమే).

అపొ. 2:38: మారుమనస్సు, బాప్తిస్మములనేవి
ʼεις ʼαφεσιν ʼαρματιων
(అక్షరార్థంగా, పాపక్షమాపణ నిమిత్తమే).[37]

బైబిలు వ్యాఖ్యానం యొక్క ప్రాథమిక సూత్రమేమంటే - ''మరో విధంగా బలవంత పెట్టబడక పోయినట్టయితే, ఒక లేఖన భాగాన్ని దాని మామూలు, సాధారణమైన, సహజ భావంలోనే తీసికోవాలి''. ఈ సందర్భంలో, 2:38యొక్క మామూలు, సాధారణమైన, సహజ భావం ఏమంటే- మారుమనస్సు, బాప్తిస్మముల ఉద్దేశం- పాప క్షమాపణ పొందడానికే. దేవుని విమోచనా సంకల్పంలో బాప్తిస్మానికి ఏ స్థానంలేదని ఈ లేఖనభాగాన్ని వ్యాఖ్యానించ బూనుకొన్న పరిస్థితిలో - దైవతత్వశాస్త్రపు పక్షపాతమే అలా బలవంతం చేసియుండాలి.

దేవుని సంకల్పంలోనుండి బాప్తిస్మాన్ని తొలిగించ ప్రయత్నించడంలో, తరచుగా వాడే ప్రతిపాదనలను యింకా గుర్తించవచ్చుగాని,[38] ఈ అంశంమీద తగినంత సమయాన్ని గడిపాం. పేతురు తన శ్రోతలను బాప్తిస్మం పొందనాజ్ఞాపించినప్పుడు, వారు నేటి కొందరికి భిన్నంగా, వెనుక ముందు ఆడలేదు, ద్వంద్వార్థంగా మాట్లాడ లేదు, లేదా బాప్తిస్మం అవసరమో లేదో అని వాదాడలేదు. (KJV పద జాలాన్ని వాడు దాం) ''అతని మాటలను ఆనందంతో అంగీకరించినవారు బాప్తిస్మము

పొందిరి'' - మొత్తం మూడువేలమంది!

## వెంటనే క్రీస్తుకు విధేయులగుటద్వారా (2:41)

41వ వచనంయొక్క అంతాన్ని మనం యింకా గుర్తించలేదు. ''... ఆ దినమున యించుమించు మూడు వేలమంది (మూడువేల ఆత్మలు) చేర్చబడిరి.'' చేయవలసిన దానిని వారు నేర్చుకొన్నప్పుడు, వారు వెంటనే దానిని జరిగించారు! వారి ఆత్మలు ఆపదలో ఉన్నాయి; వారి నిత్యత్వం త్రాసులో వ్రేలాడుతుంది. వారి ప్రభువునకు విధేయులు కాకుండ సూర్యాస్తమయం జరగడానికి వారు యిష్టపడలేదు. అలాగే నీవు చేయవలసిందేదో నీవెరిగినప్పుడు, దాన్ని ఆలస్యం చేయకు సుమీ!

## క్రీస్తు సంఘానికి చేర్చబడడం ద్వారా (2:41, 47)

మనం 41వ వచనాన్ని వదలకముందు, బాప్తిస్మం పొందిన వారికి ఏమి జరిగిందో మనం గుర్తించాలి: ''ఆ దినమున యించుమించు 3000 మంది చేర్చబడిరి.''[39] 47 వచనం - ''మరియు ప్రభువు రక్షణపొందుచున్న వారిని అనుదినము వారితో చేర్చుచుండెను'' అని అంటుంది. KJV Western text తీసికొని,[40] ''రక్షణ పొందు చున్న వారిని ప్రభువు సంఘముతోకూడ చేర్చుచుండెను'' అని అంటుంది. అనేక మంది తర్జుమాదారులు ఉపయోగించిన భాగంలో ''సంఘం'' అనే పదం లేదు. అయితే రక్షింపబడినవారు ఎవరితో చేర్చబడ్డారో సందర్భమే సూచిస్తుంది. ఒక వ్యాఖ్యాన కర్త:[41] ''ఈ భాగాన్ని లూకా ముగించుతూ, క్రొత్తగా మారుతున్నవారిని ప్రభువు సంఘంతో చేర్చుతున్నారు'' అని అన్నాడు.

యేసునుగూర్చి పేతురు తన ఒప్పుకోలును జరిగించిన తరువాత (మత్తయి 16:16), ప్రభువు అతనికి ''రాజ్యముయొక్క తాళపు చెవులు'' యిస్తానని వాగ్దానం చేశారు (మత్తయి 16:19). అంటే, సంఘ - రాజ్యపు ద్వారాలను పేతురు తొలిగా తెరిచి, జనులు అందులో ప్రవేశించేలా ఉంచుతాడని ప్రభువు వాగ్దానం చేశారు. పెంతెకొస్తు రోజున జరిగింది అదే కార్యం. సంఘంలో ప్రవేశించే షరత్తులను పేతురు తెలియజేశాడు! కృపామయుడగు దేవుడు అనుగ్రహించిన ఈ సదావకాశాన్ని 3000 మంది సద్వినియోగం చేసికొన్నారు! వారు బాప్తిస్మం పొందినప్పుడు, వారు రక్షింపబడ్డారు; వారు రక్షింపబడినప్పుడు, దేవుడు వారిని సంఘానికి చేర్చారు.

41, 47 వచనాల్లోనుండి ప్రాముఖ్యమైన అనేక సత్యాలను లాగవచ్చు. మొదటిది, సంఘంయొక్క సాధారణమైన (అయినా, లోతైన) నిర్వచనం యియ్యబడింది: సంఘం అనేది రక్షింపబడిన జనకూటమైయుంది - క్రీస్తు రక్తంచేత రక్షింపబడిన జనం! రక్షణ, సంఘ సహవాసం అనేవి రెండు వేర్వేరు విషయాలైనట్లు జనులు

తరచుగా మాట్లాడతారు.[42] అయితే మన ఆలోచనలోనున్న రెండు వచనాల సమాచారాన్నిబట్టి, ఆ రెండును ఒక్కటే!

మరలా, ఈ వచనాలు - సంఘంలో మనం ప్రవేశించలేం; ప్రభువే మనలను సంఘంలో చేర్చాలని బోధిస్తున్నాయి, ఇది కేవలం మాటల భావార్థాలనే చదవడమా? కాదు, గొప్ప బైబిలు సూత్రం చర్చలో ఉంది. నేనొక సంస్థలో చేరగోరితే చేరతాను. అవసరమైన కొన్ని కార్యాలు జరిగించడం ద్వారా, నేను ఆ సంస్థలో భాగమైయుండే హక్కును సంపాదించుకొంటాను. ఏది ఏమైన, ప్రభువు సంఘంలో భాగమైయుండే హక్కును సంపాదించుకోలేను. సంఘము రక్షింపబడినవారి సమూహమైయుంది. నాయంతట నేనే రక్షించుకోలేను గనుక, నాయంతట నేనే ఆ సంఘంలో సభ్యుడనై యుండే వీలుండదు. కృపతో నన్ను రక్షించే ఆయనే, ఆ సమూహంలో (దేహంలో) ఒక భాగంగా నన్ను చేస్తారు.[43] (ఈ ఆలోచన నాకు చాలా యిష్టం: క్రీస్తులోనికి బాప్తిస్మం పొందినవానిని దేవుడు చేర్చుతారు; మనం ఆహ్వానిస్తాం!).

ఇతర సత్యాలు 41, 47 వచనాల్లోనుండి బయటికి తీయవచ్చు, కాని మనం లేఖనానుసారంగా బాప్తిస్మం పొందినప్పుడు ''సంఘం'' అనే ఆత్మ సంబంధమైన సహవాసంలో పాలుగలవారమై యుంటామనే విషయాన్ని గట్టిగా చెప్పదలచుకొన్నాను! ఆత్మ సంబంధమైన ''ఏకాకులంగా'' ఉండాలని దేవుడు మనలను ఉద్దేశింపలేదు. నేడో రేపో, ఇతరులు మనకు సహాయపడి బలపరచవలసిన అవసరత మనకందరికి ఉంది. సంఘాన్ని స్థాపించడంలో - అంతర్నిర్మితంగా బలపరచే గుంపును దేవుడు కట్టారు![44]

రక్షణ విషయంలో మాత్రం మనమందరం భూత, వర్తమాన, భవిష్యత్ విషయాలను చక్కపరచుకొని యుండాలి. దోషారోపణతో మనలను అణచిన గత పాపాలున్నాయి; భవిషత్‌లో మనకు శక్తి చాలుతుందో లేదో అనే ఆలోచనలున్నాయి; మనలను ముంచివేయడానికి ప్రస్తుతపు ఆత్మ సంబంధమైన సవ్వాళ్లు మనచుట్టూ ఉన్నాయి, ఇలాటి ప్రతి అవసరతను దేవుడు ముందుగానే ఆలోచించారు. మారుమనస్సు పొందిన విశ్వాసులంగా మనం బాప్తిస్మం పొందినప్పుడు, మన గత ప్రతిపాపాన్ని ఆయనే చూచుకొంటారు (2:38); మనలను బలపరచి నిలబెట్టడానికిగాను ఆయన మనకు తన పరిశుద్ధాత్మను అనుగ్రహించడంతో మన భవిష్యత్తుకు ఆయనే సహాయం చేస్తారు (2:38); మనలను తన ప్రియకుటుంబమైన సంఘంలో నిలిపి, మన వర్తమానకాల విషయం ఆయన జాగ్రత్త తీసికొంటారు (2:41, 47).[45]

## ముగింపు

పెంతెకొస్తు దినాన చేరిన జనసమూహంలో రెండు వర్గాలకు చెందినవారున్నారు.

యేసుక్రీస్తును స్వీకరించినవారు, స్వీకరించని వారు; యేసుకు తమ జీవితాలను సమర్పణ చేసినవారు, అలా చేయనివారు; అంటే, రక్షింపబడినవారు, నశించినవారు! యేసే క్రీస్తని నీవు నమ్ముతున్నావా? నీ పాపక్షమాపణ కొరకు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మం పొందియున్నావా? క్రీస్తు యేసుయొక్క సంఘానికి దేవుడు నిన్ను చేర్చియున్నారా? లేనట్టయితే, నీవు నేడు ఆయనను స్వీకరింపని, సమర్పించుకోని, జనసమూహంలో చేరినవాడవై, నశించియున్నావు! ప్రభువును స్వీకరించి, తమ జీవితాలను సమర్పణ చేసికొని రక్షింపబడిన వారితో చేరడానికి ఆలస్యం చేయకు సుమీ!

## దకశ్య సాధనాకకూచనకు

''మారుమనస్సు'' అనే విషయాన్ని క్లాసులో చర్చించబోయే టప్పుడు సాధారణంగా ఆ మాటకు అర్థం విద్యార్థులు ఎలా ఆలోచిస్తుంటారో వారిని అడుగుతాను. ఎక్కువమంది పాపాలకొరకు దుఃఖపడడమని లేక జీవితాన్ని మార్చుకొనడం అని అంటూ ఉంటారు. నేను ఈ క్రింది పటాన్ని బోర్డుమీద వ్రాస్తాను.

పాపం విషయమై దుఃఖపడటం మారుమనస్సు కాదని నేను నొక్కి చెప్పుతాను, కాని దైవచిత్తాను సారమైన దుఃఖమైతే మారుమనస్సును పుట్టిస్తుందని చెప్పుతాను. మరలా, ఖచ్చితంగా చెప్పాలంటే, జీవితపు మార్పు మారుమనస్సుకాదు, కాని అది మారుమనస్సు యొక్క ఫలితమని చెప్పుతాను. మారుమనస్సు అనేది, ఈ రెండింటి నడుమ ఉంటు ంది. (పాపం విషయంలో) మనస్సు, లేక స్వభావం మారుటయై యుంది. అదంతా చెప్పిన తరువాత, ఆ పటంచుట్టు పెద్ద రౌండు గీస్తాను; దానికి ''మారుమనస్సు'' అని పేరుపెడతాను! దేవుడు మారుమనస్సుపొంద నరునికి ఆజ్ఞాపించినప్పుడు, (లూకా 13:3; అపొ. 17:30), మన హృదయాల్లోను ఇదంతా జరగాలని ఆయన కోరుతున్నారు.



## సూచనలు

[1]Edgar J. Goodspeed, *The New Testament: An American Translation* ''క్రీస్తునుగూర్చిన బోధ'' (RSV) అని ఉంది. [2]అధ్యాయాని కంతటికి - ''మూడువేలమంది ఎలా రక్షింపబడ్డారు?'' అనే పేరుపెడితే, ''క్రీస్తునుగూర్చి వినుటద్వారా'' - అనేది మొదటి పాయింటుగా ఉండవచ్చు (2:14-36). [3]''వారు దానిని విన్నప్పుడు హృదయములో పొడువబడి''నవారై అని ఉంది.'' అపొస్తలుల బోధద్వారా వాక్యమనే ఖడ్గాన్ని పరిశుద్ధాత్మ ఉపయోగించినట్టున్నారు (ఎఫెసీ 6:17). [4]మానవ స్వాతంత్ర్యంలో జోక్యం పుచ్చుకోకుండ - జరుగబోయే సంగతులను గూర్చి ముందుగా చూచి, వాటిని దేవుడు ఎలా చెప్పగలుగుతున్నారో గ్రహించడానికి సతమతమౌతున్నాం. అయితే క్రీస్తును సిలువవేయడంలో యివన్నీ ఏకంగా కలిసాయి (23 వ.). యూదులు దాన్ని సమస్యలేకుండా అంగీకరించి, వారేమి చేయాలో తెలిసికో గోరారు. [5]''ఇశ్రాయేలు వంశమంతయు'' అని సూచించి, ''మీరు సిలువవేసిన ఈ యేసునే'' అని పేతురన్నాడు. తన చుట్టునున్న వారికి ఈ సంగతి తెలియజేసినా, ''ఇశ్రాయేలు వంశమంతా'' అనేది జాతీయ దోషంగా అతడు కనుపరచాడు. యేసును మెస్సీయాగా వారు నిరాకరించారు. [6]''మారుమనస్సు''ను గ్లోజరీలో చూడు. [7]అపొస్తలులు ఆజ్ఞాపించినది నీటి బాప్తిస్మమే (10:47-48). [8]యూదా మతాన్ని పుచ్చుకోగోరిన అన్యజనులు మామూలు ఆచారాన్నిబట్టి, తమ్మును తామే నీళ్లలో ముంచుకోవాలి. [9]మత్తయి 3:6; యోహాను 3:23. [10]యేసుక్రీస్తు అనేపేరును యేసు ఒకసారి ఉపయోగించారు (యోహాను 17:3). ఆ మీదట బైబిల్లో ఈ పేరు కనబడటం యిదే మొదటిసారి.

[11]Anthony Lee Ash, *The Acts of the Apostles,* Part 1, The Living Word Commentary, ed. Everett Ferguson (Austin, Tex.: Sweet Publishing Co., 1979), 49. [12]మనం అనేకసార్లు ''క్రీస్తు నామములో'' అంటే, ''ఆయన అధికారంచేత'' అని అంటాం. ''నామం''లో క్రీస్తుయొక్క శక్తి ఆయన అధికారం కలిసియుంది. శక్తి, నామం - పర్యాయపదాలుగా ఉపయోగించబడ్డాయి - 4:7 చూడు . ''నామము'' అనే దానిలో అధికారంకూడా యిమిడియుంది. [13]కొన్ని చేతిప్రతులలో (*en*, "in") 'లో' అని యుంది; కొన్నింటిలో (*epi*) ''పై'' అని ఉంది. [14]పేతురు తెలియజేసిన షరత్తులను అంగీకరించిన తరువాత, తమ విశ్వాసంయొక్క మార్పును కనుపరచారు కాని, 21వ వచనంలో ''ప్రార్థించుట (సహాయమర్థించుట),'' 38వ వచనంలో ''నామమున'' అనేవి బాప్తిస్మం పొందకముందు నోటితో యేసునందు తమ విశ్వాసాన్ని ఒప్పుకోవాలని బలంగా సూచిస్తుంది. [15]"to call upon'' అని అర్థమిచ్చే గ్రీకు పదంనుండి "calls on'' అన్నది తర్జుమా చేయబడింది. Marshall's Literal English Translation, Twentieth Century New Testament, Amplified Bibleలో - ''దేవుని సహాయమునుకోరు'' అను అర్థమిచ్చే పదం ఉపయోగింపబడింది. [16]F. F. Bruce, *The Book of Acts,* The New International Commentary on the N. T.; rev. ed. (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988), 70. [17]I. Howard Marshall, *The Acts of the Apostles*, The Tyndale New Testament Commentaries, gen. ed. R. V. G. Tasker (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1980), 81. [18]బాప్తిస్మం పొందినవారు కేవలం ఒక ఆజ్ఞకు మాత్రమే విధేయులయ్యారని భావింపక, యేసును వెంబడించడానికి తమ జీవితాన్నే ఆయనకు అంకితం చేసినట్టు ఆయనను అనుసరించ బద్ధులైయున్నారు! [19]ఆ సమయంలో అపొస్తలులు తమ చేతులుంచి, ఏడుగురికి అద్భుతమైన శక్తులనిచ్చారు (6:6, 8; 8:6). [20]Bruce, 71.

[21]పరిశుద్ధాత్మను గూర్చి మనం ఎరిగిన దానిలో ఎక్కువ భాగం క్రొత్త నిబంధన నుండియే. [22]పరిశుద్ధాత్మనుగూర్చి యేసు తన శిష్యులకు వర్తమానం యిచ్చారు. అయితే జనులకు పరిశుద్ధాత్మనుగూర్చి అంతగా బోధింపబడలేదు. [23]పరిశుద్ధాత్మ క్రైస్తవులకు ఎలా సహాయపడతారనే చదువు చాల ఉత్సాహకరంగా ఉంటుంది. తరువాత సంచికల్లో, ''కార్యగ్రంథంలో పరిశుద్ధాత్మ'' అనే రెండు సహాయ వ్యాసాలు కన్పిస్తాయి. [24]తన శ్రోతలు నశించిపోయారన్న సంగతిని పేతురు స్పష్టం చేశాడు. [25]సువార్త ప్రకటనద్వారా దేవుడు జనులను పిలుస్తారు (2 థెస్స. 2:14). [26]''మీ పిల్లలకును'' అనే మాటలో కొందరు శిశు బాప్తిస్మాన్ని కనుగొన్నారు. అయినా ఆ వాగ్దానం మారుమనస్సు పొంది (పాపక్షమాపణ నిమిత్తం) బాప్తిస్మం పొందే పిల్లలకు చెందుతుంది. శిశువుకు తాను మారుమనస్సు పొందవలసిన పాపంలేదు సరిగదా తాను మారుమనస్సు పొందలేడు. ''మీ పిల్లలకును'' అనేది కేవలం ఒకనాటి వాగ్దానం కాదు, రాబోయే తరాలకు కూడా చెందుతుందనే భావంతో వినియోగించబడింది. [27]అపొ. 10లో పేతురు దర్శనంలో చూచిన సంగతి. అప్పటివరకు, ''దూరస్థుల కందరికిని'' అనే మాటలు చెదరిపోయిన యూదులకందరికిని పేతురు భావించియుంటాడు. ఒకవేళ దూరస్థులంటే అన్యజనులనే భావనే తన మనస్సులోనికి దూరియున్నట్టయితే,

సున్నతిపొంది యూదులుగా చేయబడితేనే తప్ప దేవుడు వారిని పిలువరని తాను అనుకొనియుండేవాడే. [28]పేతురుయొక్క సంక్షిప్త ప్రసంగమే మనకు యిక్కడ యివ్వబడింది. [29]అక్షరార్థంగా, "గంభీరంగా సాక్షమిచ్చుచు." అంటే, అపొ. 2లో దాఖలు చేయబడని, యింకా అధికమైన రుజువులు - ప్రభువు యొక్క పునరుత్థానం, ఆయన దేవత్వాన్నిగూర్చి పేతురు యిచ్చియుంటాడు. పేతురుయొక్క యితర ప్రసంగాల్లో చెప్పబడిన యితర రుజువులు - పేతురు వారితో ఏమి చెప్పాడో సూచిస్తున్నాయి. [30]''మూర్ఖులనే'' మాట గ్రీకులో - వక్రజనం అని చెప్పబడింది. లూకా 3:5లో వంకరగా ఉన్న రోడ్డును అది సూచించింది. అదే పదం ఫిలిప్పీ. 2:15లో ''మూర్ఖమైన వక్రజనం'' అని తర్జుమా చేయబడింది. వక్రజనమన్నా, తప్పు మార్గానికి లాగే వారన్నా - రెండు దగ్గర సంబంధం కలిగి ఉన్నాయి.

[31]వారికి యథార్థమైన హృదయాలే ఉంటే, వారు యేసును నిరాకరించేవారు కాదు. వక్రజనమని, మూర్ఖులగు ఈ తరమువారని పేతురు అన్న మాటలలో యిమిడియున్న భావం యిదే. [32]మూర్ఖులగు ఈ తరమువారినుండి రక్షింపబడడం అంటే, వారి దుష్టత్వంనుండి రక్షింపబడడం! లేక దాని గతినుండి రక్షింపబడటమే. యెరూషలేము నాశనంనుండి తప్పించబడడమని కొందరన్నారు. క్రైస్తవులు ఆ నాశనంనుండి, ప్రభువుచేత హెచ్చరింపబడినవారై (మత్తయి 24) తప్పించబడ్డారు. అయినా, పేతురు మనుస్సులో యింతకంటే ఎక్కువైన భావాలున్నట్టు కన్పిస్తాయ్. ''మూర్ఖులగు'' ఈ తరమువారు అనుభవించబోయే నిత్యగతినుండి - అంటే, నరకంనుండి తప్పించుకొమ్మని పేతురు హెచ్చరిస్తున్నాడు. [33]మనం మెదలకుండ కూర్చుంటే, దేవుడు ఆ పని జరిగించుకొంటారన్నట్టు కొందరన్నారు. అయితే వారేమి చేయాలో అనే సంగతి ఆ మూడు వేలమంది జరిగించిన పనిని బట్టి తేటపడుతుంది. **KJV, NIV**ల్లో ''మిమ్ములను మీరు రక్షించు కొండి'' అని ఉంది. దాన్నిబట్టి ఆ ఆజ్ఞయొక్క ఒత్తిడి మనకు తెలుస్తుంది. [34]ముంచడానికి బదులు చిలకరింపును ప్రబోధించేవారు. 3000 మందిని ముంచడానికి యెరూషలేములో వసతులు లేవు, గనుక బాప్తిస్మమంటే ముంచడానికి బదులు చిలకరించడమే అయ్యుండాలని అంటారు. ముంచడానికి అనుకూలంగా యెరూషలేములో అనేక కోనేర్లు ఉన్నట్టు **J. W. McGarvey** గుర్తించాడు. ఆ దినంలో మిగిలిన కాలమంతటిలో 3000 మందికి ముంచడం యివ్వడానికి ఏ సమస్య ఉండదని అతడన్నాడు (**J. W. McGarvey, *New Commentary on Acts of Apostles,* vol. 1 [Delight, Ark.: Gospel Light Publishing Co., n.d.] , 42-45**). [35]**Bruce, 70**. [36]ఆది భాషలో - ''మారుమనస్సు'' అనేది మధ్యమ పురుష బహువచనంలో ఉండగా; ''బాప్తిస్మముపొందుడి'' - అనేది మాత్రం ప్రథమపురుష ఏక వచనంలో తర్జుమా చేయబడినట్టు కొందరు గుర్తించారు. దీన్నిబట్టి వారి భావమేమంటే - ఆ రెండు ఆజ్ఞలు ఒకే ఉద్దేశంకొరకు యివ్వబడలేదు గనుక, ఆ రెండింటిని విడదీయాలని వారంటారు. పాపముల విషయమైన మారుమనస్సు పాపక్షమాపణను అనుగ్రహిస్తుంది; ఒకడు బాప్తిస్మం పొందడం లేక పొందకపోవడం అనేది వానికే అప్పగింపబడింది. ఒకడు బాప్తిస్మం పొందడానికి తీర్మానించుకొన్నాడంటే, అది కేవలం అది ఒక గురుతు కొరకైన కార్యం మాత్రమేనని వారంటారు. భాషా ప్రయోగపు తీరు గ్రీకులోగాని తెలుగులోగాని ఒకే రకంగా ఉంది. అపొ. 2:38లో రెండు ఆజ్ఞలు రెండు ఉద్దేశాలకని గ్రంథంలో కన్పించదు. వారు చేసిన పాపానికి వారేమిచేయాలో పేతురుయొక్క శ్రోతలు తెలిసికో గోరుతున్నారు. మారుమనస్సు పొంది, బాప్తిస్మంపొందితే, వారి పాపాలు క్షమించబడతాయని పేతురు తన శ్రోతలకు తెలిపాడు. పొందగోరిన పాపక్షమాపణ, పేతురు బాప్తిస్మాన్ని ఆజ్ఞాపించేవరకు ప్రస్తావించబడలేదు. ఈ పాఠ్యాంశంమీద యింకా చదువగోరితే, **Jimmy Allen, *Survey of Acts,* vol.1 (Searcy, Ark.: By the Author, 1986), 35-37**.

[37]లూకా 24:47లో - ''మారుమనస్సును-పాపక్షమాపణయు ప్రకటింపబడుననియు'' వ్రాయబడియున్నది. [38]బాప్తిస్మమునకు విరోధంగా ఉపయోగించే సాధారణమైన వాదమేమంటే - ''రక్షణ'' విశ్వాసం ద్వారానేగాని, క్రియలవలన కాదు అని అంటారు (ఎఫెసీ. 2:8-9; రోమా 4), బాప్తిస్మం క్రియ గనుక అది రక్షణలో భాగమయ్యే అవకాశం లేదని వారు వాదిస్తారు. అయితే ఈ వాదన - యోగ్యతా క్రియలకు, విశ్వాసపు క్రియలకు మధ్య వ్యత్యాసాన్ని చేయలేకపోతుంది. ప్రభువుకు విధేయత చూపకపోతే, మనం రక్షింపబడనేరమని లేఖనాలన్నిటిలో కన్పిస్తుంది (మత్తయి 7:21; హెబ్రీ. 5:9). మనం బాప్తిస్మంపొందినప్పుడు మన రక్షణను సంపాదించుకొంటున్నాం అని చెప్పిన వారిని నేను చూడలేదు. అయితే దేవుడు చేసిన కృపా ఏర్పాటును (అనుభవించడానికి) సద్వినియోగం చేసికొనడానికి గాను, ఆయన చేయనాజ్ఞాపించిన దానిని మనం చేస్తాం. ''బాప్తిస్మం పొందినవాడు'' అనేది వినయమైన స్థితిని సూచిస్తుంది. బాప్తిస్మం పొందేవారు నీళ్లలో ముంచబడడానికి అప్పగించుకొంటారు గనుక తక్కువ పనిచేసిన స్థితిలో ఉంటారు. నమ్ముటలో, మారుమనస్సు పొందుటలో, యేసు నామమును ఒప్పుకొనుటలో - చురుకుగా ఉన్న వ్యక్తి- మరొకరిచేత ముంచబడతాడు. బాప్తిస్మంలో యిచ్చేవాడు చేసేంతగా, పొందేవాడు చేయనవసరంలేదు. [39]''చేర్చబడి'' అనే పదం-యింతకముందు ఎవరో ఉన్నారనే భావాన్ని సూచింపక, సంఘంగా చేర్చబడిరి అనే సూచింపవచ్చు. కాని,

‘‘చేర్చబడిరి’’ అనే పదం సాధారణంగా అపొస్తలులతో కూడా చేర్చబడిరి అని సూచిస్తుంది. [40]“Notes on the Text Used in These Studies’’ అనే సహాయ - వ్యాసం తరువాత సంచికలో వెలువడుతుంది. [41]Simon J. Kistemaker, *Exposition of the Acts of the Apostles,* New Testament Commentary (Grand Rapids, Mich.: Baker Book House 1990), 114. [42]అలాటి భావాలుగలవారు తమ మనస్సులో మత శాఖలవారైయున్నారు. రక్షింపబడిన వ్యక్తి, ఏ మతశాఖలో సభ్యుడైయుండ నవసరంలేదు కాని, రక్షింపబడినవాడు ప్రభువు సంఘంలో భాగంగా ఉండకుండ ఉండలేడు. [43]ఇక్కడ సార్వత్రిక సంఘానికిని, స్థానిక సంఘానికి వ్యత్యాసం చేయాలి. ప్రభువు నన్ను సార్వత్రిక సంఘానికి చేర్చిన తరువాత, దేవుని ప్రజలతోకూడిన నమ్మదగిన స్థానిక సంఘంలో ‘‘నేను చేరాలి.’’ అపొ. 9:26 సూచనలో యిది ఎక్కువగా చర్చింపబడింది. [44]“a support system,’’ “a built-in spiritual network’’ లాంటి నేడు వాడుకలోనున్న వాటిని కలుపుము. [45]మన ఆత్మసంబంధమైన అవసరతలను ముందుగా గుర్తించి, వాటిని తీర్చడానికి దేవుడు ఏర్పాటు చేసిన మార్గాలు ఈ మూడేకావు. అయితే ఆయన అనుగ్రహించిన ఈ మూడును అపొ. 2లో కన్పిస్తున్నాయి.

## ప్రసంగం, తరగతి సహాయాలు